క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తండ్రి హన్మంతరావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి సీరటి ఆదిత్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మోహన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యార్థులు మంచి కోర్సులను ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల: విద్యార్థులు మంచి కోర్సులను ఎన్నుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. సోమవారం కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థులకు అభ్యాసన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారికి అవగాహన ఉండి వారికి ఇష్టమైన కోర్సులు ఎన్నుకోవాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ గోవర్ధన్, అధ్యాపకులు ప్రకాశ్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లై అధికారి వరప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్ మండలం మోతె, ధరూర్, రూరల్ మండలం వెల్దుర్తి, తిమ్మాపూర్, అంతర్గాం, నర్సింగాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, ఏఈవోలు శ్రీనివాస్, రమ్య, నాగరాజు, హరీశ్, సీసీలు గంగరాం, సాగర్, మరియ, వీఏవోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులను పరీక్షించి, నలుగురు విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంటి చూపు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నగేశ్, ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి, సీహెచ్‌వో శ్రీధర్, వైద్య సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రవళి పై అదే గ్రామానికి చెందిన ఆడెపు సౌమ్య అనే మహిళ సోమవారం పోస్ట్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన సొంత స్థలంలో షటర్ రూమ్ నిర్మించుకునేందుకు టీఎస్‌బీపాస్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా,అనుమతి ఇవ్వకుండా పెండింగ్ పెట్టడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తనకు న్యాయం చేసి, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఐ ఓట్ ఫర్ షూర్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై మున్సిపల్ అధికారులు సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని అధికారులు వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మహేశ్, మున్సిపల్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెహిందీ కార్యక్రమం

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మెహిందీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, పీఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంపునకు ఆర్‌పీలు కృషి చేయాలి

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఆర్‌పీలు కృషి చేయాలని మెప్మా ఏవో శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఓటు హక్కు వినియోగంపై ఆర్‌పీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌పీలు తమ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్రత్యేకంగా మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కమిషనర్ మోహన్, ఇన్‌చార్జీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ విద్యార్థులు, అధ్యాపకులు

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఓటరు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలన్నారు. అనంతరం మహిళలు మెహందీ ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరించారు.

ఘనంగా రంగవల్లుల పోటీలు

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికల్లో అవగాహన కల్పించడం కోసం సోమవారం సాయంత్రం రంగవల్లుల పోటీలను నిర్వహించారు. పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమీకృత మార్కెట్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలకు అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అదే విధంగా మెహందీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు, కన్సలోషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ గంగాధర్, పారిశుధ్య సూపర్‌వైజర్ గంగాధర్, ఆర్పీలు పాల్గొన్నారు.

వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీ



మెట్‌పల్లి పట్టణంలో వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీలో భక్తులు

మెట్‌పల్లి: పట్టణంలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆరపేట శివాలయం నుంచి భారీ హనుమాన్ విగ్రహంతో ప్రారంభమైన విజయయాత్ర పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా అయ్యప్ప ఆలయం వరకు సాగింది. దీనిలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలో సోమవారం రాత్రి హనుమాన్ దీక్షాపరులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ముందుగా కథలాపూర్ శివారులోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.గ్రామం మొత్తం జై శ్రీరాం అంటూ నినాదాలు మార్మోగింది.

పల్లకీలో గుండు పెరమాండ్ల స్వామి ఊరేగింపు



కథలాపూర్‌లో పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కథలాపూర్: మండలకేంద్రంలో గుండు పెరమాండ్ల స్వామికి సోమవారం పల్లకీ సేవ చేశారు. గ్రామంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామశివారులోని ఆలయం వరకు పల్లకీలో ఊరేగించారు.ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ కనక సోమేశ్వర స్వామికి 25 తులాల వెండి శివలింగం సమర్పణ

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన ఎలాల సందిల్ల లక్ష్మారెడ్డి–రజిత దంపతులు రూ.22,500 విలువ గల 25 తులాల వెండి శివలింగాన్ని సోమవారం శ్రీ కనక సోమేశ్వర స్వామి వారికి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు బల్యాపెల్లి ప్రభాకర్‌శర్మ ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నకేశవనాథ ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

రాయికల్: పట్టణంలోని పంచముఖ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లకుమదేవి, దత్తాత్రేయ, జగద్గురు శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమాన్ ఆలయం నుంచి విగ్రహాల శోభాయాత్ర, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ వంటి ప్రత్యేక పూజలు అర్చకులు మునుగోటి రమేశ్ శర్మ, సతీశ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి, సభ్యులు శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా శతచండీ మహాయాగం ప్రారంభం

ధర్మపురి: పట్టణంలో శతచండీ మహాయాగం సోమవారం ఘనంగా ప్రారంభించారు. శ్రీ సాయి శివ బాలాజీ ఆలయ వ్యవస్థాపకులు ఒజ్జల ప్రవీణ్‌శాస్త్రి స్వాతి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ కాసర్ల వంశీకృష్ణ మంత్రోచ్చారణలతో ఈనెల 22 నుంచి 24 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సోమవారం పుణ్యాహవచనం, చండీ పారాయణం, గణపతి హోమం, పూజలు నిర్వహించారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

మండలంలోని జైనా శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా కుడిక్యాల రాజేశం, వైస్ చైర్మన్‌గా అయ్యోరి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గుండ్ల గంగాధర్, కమిటీ సభ్యులుగా రవి, హన్మండ్లు, గంగాధర్‌ను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

జగిత్యాలరూరల్/జగిత్యాల: అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలోని అన్నిగ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యతో పిల్లల్లో మేథోవికాసం, సామాజిక, సాంఘీక వికాసం, భాషాభివృద్ధి జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జానకి, స్వరూప, కవిత రాణి, లావణ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5 ఏళ్ల లోపు పిల్లలకు సర్టిఫికెట్లు, ప్రొగ్రెస్ కార్డులను అందచేశారు. పిల్లల తల్లులు టీచర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నవనీత, రామలక్ష్మి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



వేడుకల్లో సీడీపీవో వీరలక్ష్మి, చిన్నారులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన న్యాయవాది ఎలాల మధుసూదన్‌రెడ్డితో పాటు మరికొంతమంది సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

మెట్‌పల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన పలువురిని ఈ నెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించడానికి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గజెల్లి రాందాస్, ఆల్‌రౌండర్ గంగాధర్, శ్రీలత, భవాని, కార్తీక్ పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ముత్తయ్యరెడ్డి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

పెగడపల్లి:పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా సోమవారం పెగడపల్లిలో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలంటే బీజేపీని గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సత్యం, మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, కస్తూరి సత్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలి

కోరుట్ల: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ప్రతీ బూత్ స్థాయి నాయకులు కృషి చేయాలని కోరుట్ల పట్టణ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వడ్డెపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ అన్నారు. పట్టణంలో సోమవారం బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన 70 శాతం ఓటింగ్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పోలయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా సురేశ్

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడిగా తిమ్మని సురేశ్ ను నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి సోమవారం ఉత్తర్వులు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సుంచు రణదీర్, పంతంగి వెంకటేశ్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా అరిసెల్ల శ్రీనివాస్

మల్లాపూర్: చిట్టాపూర్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా అరిసెల్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. మండలంలోని చిట్టాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సామల్ల గంగాధర్, కార్యదర్శిగా జెల్ల జనార్దన్, దేవాలయ అధ్యక్షుడిగా చెన్న నర్సయ్య, ఉపాధ్యక్షుడిగ్లా నాగభూషణం, దైవశెట్టిగా వాసం శంకర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

మెట్‌పల్లిరూరల్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ సంస్థ చైర్మన్ శోభ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ 434 వ బ్రాంచ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. కొత్తగా ఖాతా తీసుకునే వారికి జీరో ఖాతాను ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుశాంత్, జగ్గాసాగర్, మెట్‌పల్లి బ్యాంక్ మేనేజర్లు నరేశ్, పవన్, క్యాషియర్ ప్రణయ్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని పంచముఖీ హనుమాన్ దేవాలయం వద్ద దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు సోమవారం అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో హనుమాన్ ఆలయం చుట్టూ ప్రహరీ, ఆలయం చుట్టూ సీసీ ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తున్నారు. ఎవరైన దాతలు విరాళాలు అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

దీక్షాపరులకు రేడియం స్టిక్కర్ల అందజేత

జగిత్యాలరూరల్: కొండగట్టు హనుమాన్ జయంతి కోసం పలు జిల్లాల నుంచి కాలినడకన వచ్చే దీక్షాపరులకు రాత్రివేళలో రహదారి వెంట సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సోమవారం రాత్రి తిప్పన్నపేటలో రూరల్ ఎస్సై సదాకర్ ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లు అందజేశారు. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు రేడియం స్టిక్కర్లతో కాలినడకన వెళ్లే భక్తులను గుర్తించేందుకు ఉపయోగపడతాయన్నారు.

క్రీడాకారులను ప్రోత్రహించడం అభినందనీయం

మల్లాపూర్: క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కిసాన్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మహిపాల్‌రెడ్డి(సిరిపూర్) స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత సన్మార్గంలో ముందుకు నడవాలన్నారు. క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏనుగు రవీందర్‌రెడ్డి, మిట్టపెల్లి రాజేందర్‌రెడ్డి, ఏనుగు ప్రవీణ్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నువ్వు పంటలు పరిశీలన

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లిలో నువ్వు పంటలను మండల వ్యవసాయ అధికారి నాగమణి సోమవారం పరిశీలించారు. పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి సరఫరా చేసిన జేజీఎస్–3287 రకం పంటను పరిశీలించారు. ఈ రకం నువ్వు పంట 90 నుంచి 95 రోజుల్లో కాయ తొలుచు పురుగును తట్టుకుని 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు

జగిత్యాల/జగిత్యాల రూరల్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా జిల్లా నుంచి నాయకులు వేలాది మంది తరలివెళ్లారు. నిజామాబాద్ కు సీఎం వచ్చిన నేపథ్యంలో జిల్లాకు చెందిన రెండు నియోజకవర్గాలకు చెందిన నాయకులు తరలివెళ్లి బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం జీవన్‌రెడ్డి నామినేషన్‌కు ఆయన వెంట తరలివెళ్లారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



భూపతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోరుట్ల: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని డీసీఈబీ సముద్రాల మరళి మనోహరా చారి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గడెల భూపతి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తమ పదవీ కాలంలో చేసిన కార్యక్రమాలు మాత్రం నిరంతరం గుర్తుంటాయన్నారు. భూపతి తన పదవీ కాలంలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అనంతరం భూపతి దంపతులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జెడ్పీ డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, రిటైర్డ్ ఎస్పీ రమేశ్ బాబూ, ఎంఈవో గంగుల నరేశం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘టెట్’ నుంచి మినహాయింపు ఇవ్వాలి

వెల్గటూర్ : ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చి, ప్రమోషన్లు ఇవాలని పీఆర్‌టీయూటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్నాథరెడ్డి, బోయిన్‌పల్లి ఆనందరావు అన్నారు. ఎండపల్లి మండలం ముంజంపల్లి జెడ్పీ హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం కాలగిరి లక్ష్మీబాయి పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హెచ్‌ఎం లక్ష్మీభాయిని ఘనంగా సన్మానించి, ఆమె చేసిన సేవలను కొనియాడారు. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ సరెండర్ లీవులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో బత్తుల భూమయ్య, పీఆర్‌టీయూటీఎస్ వెల్గటూర్ మండల అధ్యక్షుడు నర్సింగం, నాయకులు జోగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మహాయాగం

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేటలో వీరభద్రేశ్వరి స్వామివారి ఆలయంలో సోమవారం హనుమాన్ యాగం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో వేదపండితులు గుండి నర్సయ్యశర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, అభిషేకంచ మహాయాగం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ ఉత్సవాలు

మల్లాపూర్: మండల కేంద్రంలో సోమవారం హనుమాన్ పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలిరాగా.. స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ దీక్షదారులు జైజై శ్రీరామ్..జైజై శ్రీరామ్‌ అనే నినాదాలతో ఊరేగింపుగా పల్లకీ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మ, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, ముద్దం సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



దమ్మన్నపేటలో మహాయాగంలో భక్తులు

అంతా రామమయం



పూజలు చేస్తున్న భక్తులు, పూజారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని అఖండ సాయినామ జపం నిర్వహించారు. లక్ష్మీ గణేశ్ మందిర్ సత్సంగ్ సభ్యులు తారకమంత్రాన్ని జపిస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బట్టు సుధాకర్, కొత్త మోహన్, శ్రీనివాస్, తౌటు రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జలధారాభిషేక పూజ

గొల్లపల్లి: మండలంలోని భీంరాజపల్లిలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం 108 బిందెలతో విగ్రహాలకు సహస్రజల జలధారాభిషేక పూజ కన్నుల పండువగా జరిగింది. మహిళలు, గ్రామస్తులచే విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం మహానైవేద్యం, మంత్రపుష్పం, మంగళ నీరాజం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.



జలాభిషేకం చేస్తున్న భక్తులు

పాఠశాలలో వీడ్కోలు హంగామా



ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, సరోజ, చామంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.